

ప్రతి జిల్లాలో భాషా పరిరక్షణ సమితి అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : మాతృభాషాభివృద్ధి జరగాలంటే ప్రతి జిల్లాలో ఒక భాషా పరిరక్షణ సమితి ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం దానికి చట్టబద్ధత కల్పించి, అది చేసే పనులకు అధికార భాషా సంఘం తోడ్పాటు లభించే విధంగా చూడాలని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు టిజివి కళాక్షేత్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఒకటవ తరగతి నుంచి డిగ్రీ వరకు మాతృభాషలో విద్యాబోధన జరగాలని, తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే భాషాభిమానులను ప్రోత్సహించాలని కోరారు. భాషాభివృద్ధికి సాహిత్య సంస్థలను నెలకొల్పి నిరంతరం కృషి చేసే వారికి ప్రభుత్వ తోడ్పాటు అందించాలని చెప్పారు. ప్రతి జిల్లా నుంచి భాషావేత్తలు, భాషాభిమానులు, సాహితీవేత్తలు ప్రతినిధులుగా పాల్గొని తెలుగు భాషాభివృద్ధికి అమూల్యమైన సందేశాలిచ్చి అనేక సూచనలు చేశారు.

వేతనాలు పెంచకపోతే నిరవధిక సమ్మె

సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మె తప్పదని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శనివారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్ నుంచి ప్రారంభమై సంధ్యా సర్కిల్ మీదుగా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నెల నుంచి అనేక రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పెరిగిన ధరలు, ఫీజుల వల్ల కుటుంబ పోషణ, ఇంటి బాడుగలు కట్టలేక కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ నెల 4న విజయవాడలో జరిగిన ధర్నాలో తాము సమ్మె ప్రకటించినా, ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నామని తెలిపారు. దీనికి ప్రభుత్వమే కారణమన్నారు. పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కవర్ స్లాంట్ ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, అవుట్‌సోర్సింగ్ వర్కర్లను ఆప్కాస్‌లోకి చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. సమ్మెలో అమినిటీస్ సెక్రెటరీలతో పని చేపించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. నీళ్ల తిప్పడం వల్ల ప్లైన్ సమస్యలు వస్తే దానికి కమిషనర్ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రా రెడ్డి, జిల్లా కోశాధికారి ఎస్.గోపి, సహాయ కార్యదర్శులు ఎం.ఆనంద రావు, టి.బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, వాటర్ నాయకులు కె.సుబ్బరాయుడు, గురవయ్య, గోవర్ధన్, చావయ్య, జయరాం, రాంమోహన్, శ్రీకాంత్, మహేశ్వర రెడ్డి, విజయ్, ప్రసాద్, లోకేష్, జయపుత్రుడు, వెంకటసుబ్బయ్య, శివ, చంద్రాయుడు, యల్లయ్య, సోమిరెడ్డి, సత్యనారాయణ, శివ, రాజా, చిన్న రెడ్డయ్య, చిన్న ఓబులయ్య, నారాయణ, సుబ్బరాయుడు, ఆంజనేయులు, శ్యాం బాబు, సందీప్ సాగర్, సుబ్బయ్య, రమణ, ప్రసన్న కుమార్, రమేష్ బాబు, గోపాల్, పాలకొండయ్య, శాంతమ్మ, పవన్, ఈశ్వరయ్య, ఈశ్వర్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

విజ్ఞాన అభివృద్ధే జెవివి లక్ష్యం : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల చైతన్యం, విజ్ఞాన అభివృద్ధి జెవివి లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి అన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్.వి.ఇంజనీరింగ్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. జాతీయ పతాకం, జెవివి పతాకాలను ఆవిష్కరించారు. ఉద్యమ గీతాలాపనతో సభలను ప్రారంభించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక పోరాడుతున్నదని తెలిపారు. ముఖ్యంగా బాల, బాలికల ఆరోగ్యం, విద్య తదితరాల కోసం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో జెవివి మరింతగా సమాజానికి చేయాలని అన్నారు. జెవివి వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్యకు సంబంధించి వేదిక ప్రధానంగా కృషి చేస్తుందని చెప్పారు. ప్రజలను చైతన్యవంతులను చేయడం, అన్ని రంగాల్లో సంతులిత అభివృద్ధిని సాధించే విధంగా ఉత్సాహపరచడంలో జెవివి. తనవంతు పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ మాట్లాడుతూ జెవివి భావి, భారత పౌరులకు, వారి విద్యకు సంబంధించి సమగ్ర వికాసానికి తగిన కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె.రాకేష్ చంద్రం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి ఆరోగ్యం, విద్యా కేంద్రీకృతంగా జెవివి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జన చైతన్య సంఘం నాయకులు బి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సమాజం కోసం జెవివి. నాయకులుచేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జాతీయ నాయకులు బి.విశ్వనాథ, కృష్ణాజీ, శ్రీనివాసులు,సనావుల్లా, మహమ్మద్ మియా,యస్.స్వరాజ్య లక్ష్మి,వెంకట రామిరెడ్డి, బసవన్న, చలపతి,పలువురు ప్రజాసంఘాల నాయకులు,ప్రముఖ వైద్యులు, జిల్లానాయకులు కె.సురేష్ బాబు, సుధాకర్, గౌరీ శంకర్, మహబూబ్ బాషా, ఎల్లేశ్వర రావు, నాగార్జున రెడ్డి, భాస్కర్ ప్రసంగించారు. సభలో రాష్ట్రంలోనే అన్ని జిల్లాల నుంచి, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల జెవివి.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 'గాజుపెంకుల మీద నడక' కార్యక్రమం నిర్వహించగా చిన్నారులతో సహా పలువురు పెద్దలు కూడా భాగస్వాములయ్యారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపండి

కరపత్రాల పంపిణీలో సిపిఎం నాయకులు



స్మార్ట్ మీటర్లు వద్దంటూ స్టిక్కర్లు అంటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప రామకృష్ణ నగర్ లో స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15454 కోట్లు మోపారని, ఇది దుర్మార్గమని చెప్పారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయడానికి అవసరమైన క్లాజు ఉన్నదని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. అనంతరం ఇంటింటికి స్టిక్కర్లు స్మార్ట్ మీటర్లు రద్దు స్టిక్కర్లు ఇంటింటికి అంటించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఐ.ఎన్.సుబ్బమ్మ, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహ, కామేశ్వరమ్మ, స్థానిక రామకృష్ణ నగర్ కెవిపిఎస్ నాయకులు సి.శేఖర్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకుంటాం

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తే అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యవర్గ జిల్లా మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి వెళ్లి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలకి అవగాహన కల్పించి స్టిక్కర్లను అంటిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని హామీ ఇచ్చి నేడు అధికారం లోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, కమిటీ సభ్యులు ఎ.వినయ్ కుమార్, దాసరి విజయ్, హుస్సేన్ వల్లి, అబ్రహం, ప్రసాద్ రెడ్డి, నరేంద్ర, ఆదాము పాల్గొన్నారు.

పోలీసుల తీరుకు వ్యతిరేకంగా మహిళల ఆందోళన

తాలూకా పోలీసు స్టేషన్ ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం పెద్ద శెట్టిపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో పబ్లిక్ రోడ్డుపై ప్రజలను తిరగవద్దని తాలూకా సిఐ బెదిరించినందుకు నిరసనగా ఐద్వా మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్దశెట్టిపల్లె రస్తా విషయమై జరిగిన ఘర్షణలో కళావతి అనే మహిళ గాయపడిన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మమిళ గాయపడిన విషయంపై తాము పోలీస్ అధికారులను కలువగా మీపైనా కూడా కేసులు పెడతామని ఎస్ఐ బెదిరింపు బెదిరించడం సమంజసం కాదన్నారు. కేసు నమోదు చేస్తే తిరిగి సోమవారం తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్నా చేస్తామని హెచ్చరించారు. సమస్యను పరిష్కరించకుండా ప్రజలకు గొడవలు సృష్టించేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్ఐ రాజు వ్యవహారశైలి సరిగ్గా లేదన్నారు. స్టేషన్‌కు వచ్చిన వారిని గౌరవించడం లేదని వాపోయారు. ఇదే పద్ధతి కొనసాగి స్తే పోలీస్ స్టేషన్ ఎదుట టెంట్ వేసి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్, పట్టణ కార్యదర్శి ఝూన్సీ, విజయ, మేరీ ,కళావతి హిమజ, సిఐటియు నాయకులు సాల్మన్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షుడు మేరీ ప్రయివేట్ టీచర్ సంఘ నాయకులు రాజు, తేజ, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ , సిపిఎం కార్యదర్శి సత్య నారాయణ వారికి మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు.మహిళలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

- పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి పంచాయతీ పరిధిలోని చింతల మడుగుపల్లె గ్రామానికి చెందిన నిందితుడు మడక బాబును పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు. శనివారం వేంపల్లె పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేవంలో డిఎస్‌పి మాట్లాడారు. ఈనెల 7న పక్కీర్ పల్లెకు చెందిన బాలిక వజ్రాల గుట్టకు గొర్రెలను తోలుకొని వెళ్లి రాలేదని ఫిర్యాదు అందిందని చెప్పారు. అమ్మాయి అదృశ్యం కావడానికి మడక బాబు అనే వ్యక్తి కారణమని ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దీంతో అమ్మాయి ఆచూకీ కోసం వెతికామన్నారు. ఈ ఘటనలో అమ్మాయి ఆచూకీ లభించిన తర్వాత పోలీసుల విచారణలో మూడేళ్లుగా మడక బాబు, బాలిక ఇంస్టాగ్రామ్‌లో తరచూ మాట్లాడుకుంటూ ప్రేమించుకుంటున్నారనే విషయం తెలిసిందని చెప్పారు. వారి తల్లిదండ్రులు పలుమార్లు వారిద్దరిని మందలించారని చెప్పారు. ఈవిషయం అమ్మాయి అతని తల్లిదండ్రులకు చెప్పిందని పేర్కొన్నారు. తమఅబ్బాయి తో మాట్లాడి చెబుతామని అమ్మాయికి నచ్చజెప్పి వారి తల్లిదండ్రులు పంపించారని తెలిపారు. ఈనెల 7న అమ్మాయి మడక బాబుకు ఫోన్ చేసిందని తెలిపారు. ఇద్దరూ కొండ ప్రాంతానికి వెళ్లి మాట్లాడుకుంటున్న సమయంలో గొర్రెల యజమాని చూసి అమ్మాయి తండ్రికి ఫోన్ చేశాడని చెప్పారు. దీంతో తమ తల్లిదండ్రులు మడకడబాబును ఎక్కడ కొడతారోనని పారిపోమని అమ్మాయి చెప్పిందని పేర్కొన్నారు. ఆమె కూడా ఆ రోజు రాత్రి వరకు కన్పించలేదని తెలిపారు. ఆ రోజు రాత్రి 10 గంటల సమయంలో అమ్మాయిని గుర్తించి ఆరోగ్యం రీత్యా కడప రిమ్స్ ఆసుపత్రికి పంపారన్నారు. అమ్మాయి ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఫోక్సో కేసు నమోదు చేసి శనివారం చక్రాయపేట బస్టాండ్‌లో ఉన్న మడక బాబును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. ఇద్దరూ ఇష్టపూర్వకంగా కలిసినప్పటికీ మైనర్ కావడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు.



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మురళీనాయక్

హైకోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్తాం

ఈనెల 7న వేంపల్లె పోలీసు స్టేషన్ పై దాడి చేసిన ఘటనలో 12 మందితో పాటు మరో 150కి పైగా కేసు నమోదు చేసినట్లు పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్ తెలిపారు. ఈ కేసు ు సంబంధించి ఇద్దరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించడంతో 109 సెక్షన్ వర్తించదని ముద్దాయిలందరికీ 41-ఎ కింద నోటీసులు ఇచ్చి సిసి ఫుటేజ్‌లో వారి గుర్తించి చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించిందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై లీగల్ ఒపీనియన్ తీసుకొని వాటిపై అప్పిల్ కు వెళ్తామని చెప్పారు. తాము విచారణ చేస్తున్న సమయంలో ఒక వర్గానికి చెందిన 400 మంది మూకుమ్మడిగా పోలీసు స్టేషన్‌కు వచ్చారన్నారు. పోలీసు స్టేషన్ పై రాళ్లు వేసి మూకుమ్మడిగా దాడి చేశారని తెలిపారు. తాము ఎంత చెప్పినా వినకుండా పోలీసు స్టేషన్ పై దాడి చేశారని చెప్పారు. సిసి ఫుటేజ్ ఆధారంగా ముద్దాయిలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి 11 మందిని అరెస్టు చేశామని చెప్పారు. కోర్టు సూచనల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐ నరసింహులు, ఎస్ఐ రంగారావు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య

ప్రజాశక్తి - కడప అర్బన్


ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్య లభిస్తుందని, తల్లికి వందనం డబ్బుతో పాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని ముస్లిం సమైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. కడప నగరం జామున్ బౌలి లోని నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముస్లిం సమైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ సలావుద్దీన్, గౌరవ అతిథిగా హాజరైన రహమాన్, సొసైటీ అధ్యక్షులు ఖుతుబుద్దీన్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పండ్లు, ఆకుకూరలు పుష్కలంగా తీసుకో వాలని కోరారు. బాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహ బూబ్ పీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని అప్పుడే సత్ఫలితాలు సాధ్యమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజమ్మ 'తల్లి ప్రాముఖ్యత' పై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సయ్యద్ సలావుద్దీన్, రెహమాన్, కుతుబుద్దీన్, డాక్టర్ మహబూబ్ పీర్‌ను ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్

చందన గార్డెన్స్ వెంచర్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రతిష్టాత్మక రియల్ ఎస్టేట్ సమస్త అయినా శ్రీ సత్య గ్రూప్ నూతన డైరెక్టర్ గా కడప కు చెందిన ప్రముఖ విద్యావేత్త లయన్ పఠాన్ అక్బర్ ఖాన్ నియామకమయ్యారు. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని తమ సొంత కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భవనాసి సత్యనారాయణ శాలువా బొక్కెలతో సన్మానించి నియామక పత్రాన్ని అందించారు. యోగివేమన యూనివర్సిటీ అతి సమీపంలో 20 ఎకరాల స్థలంలో వేసిన శ్రీ చందన గార్డెన్స్ బ్రోచర్ను ఆవిష్కరించారు. పఠాన్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ ఒక సంస్థ ఎదగాలంటే ఆ సంస్థలో పనిచేసే సిబ్బందికి క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలు, యాజమాన్యం పట్ల కృతజ్ఞతా భావం ఉండాలన్నారు. కార్యక్రమంలో భవనాసి సత్యనారాయణ, ఆడిటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పఠాన్ షరీఫ్ ఖాన్, టిడిపి నగర ఉపాధ్యక్షులు, యువ నాయకులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, ముస్లిమ్స్ రైట్స్ ఫారం రాష్ట్ర అధ్యక్షులు షేక్. దస్తగిరి, రిటైర్డ్ లెక్చరర్ నర్సారెడ్డి, సాధకలి, రాధాకృష్ణ, సురేంద్రబాబు, ఏజెంట్లు పాల్గొన్నారు. నూతన డైరెక్టర్ గా ఎన్నికైన పఠాన్ అక్బర్ ఖాన్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న పఠాన్ అక్బర్‌ఖాన్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎస్‌పి

బంగారు భవితకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుని కష్టపడితే విజయం మీ సొంతమవుతుందని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ సంక్షేమంలో భాగంగా టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 63 మంది పోలీసు కుటుంబాల పిల్లలకు నగదు ప్రోత్సాహక మెరిట్ స్కాలర్ షిప్ , ప్రశంశా పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బాగా చదివి బంగారం లాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీసు పిల్లలు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి మెరిట్ స్కాలర్ షిప్ అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఈ స్ఫూర్తితో మున్ముందు రెట్టింపు కృషితో చదువులలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా సిబ్బందికి వైద్య పరీక్షలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణం స్పందించి వైద్య సేవలు అందించడంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీశైల రెడ్డి, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, పోలీసు కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

- జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆరోగ్యవంతులు రక్తదానం చేసి పలువురిని బతికించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ లో కడప జిల్లా స్వచ్ఛంద సేవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు వారం రోజులు పాటు కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ లో రక్త నిల్వలు చాలా తక్కువ ఉన్నాయని తెలిపారు. కావున 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు రావాలన్నారు. రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ యశస్వి మాట్లాడుతూ ఏ ప్రయోగశాలలోనూ తయారు అవ్వనిది రక్తం మాత్రమే అన్నారు. అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరని తెలిపారు. కార్యక్రమంలో శివాంజనేయ, విజయ్ కుమార్, తారిఖ్, సుబ్బారావు, ఓబయ్య, గురు కిరణ్ పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న సురేష్‌కుమారి

షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదు

ప్రజాశక్తి - కడప : ప్రజల సమస్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరి కాదని కాంగ్రెస్ పార్టీ యువ నేత మధు రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పనితీరుపై ఈ సందర్భంగా మధు రెడ్డి తీవ్రంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పరిస్థితి అంతంత మాత్రం ఉన్నప్పుడు యువత, సీనియర్ కార్యకర్తలు పార్టీని ముందుకు నడిపించారన్నారు. 2024 ఎన్నికల్లో కూడా యువత వారి భవిష్యత్తును పక్కనపెట్టి ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని ముందుండి పార్టీని నడిపించారన్నారు. కొత్తగా వచ్చిన డిసిసి, కో- ఆర్డినేటర్లు ఏ కార్యక్రమాలు చేయరన్నారు. ప్రస్తుతం కొత్త డిసిసి వచ్చినప్పుడు నుండి రెడ్ బుక్ రాజ్యాంగం కన్నా ఘోరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

శరాఘాతం!

ప్రజాదృష్టి

జిల్లాలో సార్వత్రిక సమ్మె అంచనాలకు మించి జయప్రదం కావడం అభినందనీయం. ఢిల్లీ నుంచి గల్లీ వరకు కార్మికలోకం ఒక్క తాటిపైకి వచ్చి ఉద్యమించడం పాలకులకు శరాఘాతంగా మారింది. కార్మిక నాయకత్వం పకడ్బందీ వ్యూహరచన చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనపై పట్టు బిగించాలి. 1886లో ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 29 లేబర్ కోడ్‌లను నాలుగు కోడ్లకు కుదించడం ఎంత తెంపరితనమో ఆలోచించాలి. కార్మికుల పని గంటలను పెంచడం ఏమిటో తెలియడం లేదు. కార్మికుల శారీరక, మానసిక ఆరోగ్యం, కుటుంబానికి సమయం కేటాయించడం వంటి మానవీయ హక్కుల గురించి ఆలోచించకపోవడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేతనం చెల్లించాలనే డిమాండ్లను సాధించుకునే వరకు పట్టుసడలని వాతావరణాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో సుమారు 20 లక్షల మంది కార్మికులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కార్మిక నాయకత్వంపై ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి కార్పొ రేట్లకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుని, లక్షల కోట్ల రూపాయలను రైటాఫ్ చేయడం ఏమిటనే ప్రశ్న పెద్దఎత్తున వినిపిస్తోంది. వేళ్ల మీద లెక్కించదగిన కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలతో దోచిపెట్టడంపై ఉన్న శ్రద్ధ, కోట్లాది మంది కార్మికుల ఆరోగ్యం, వారి న్యాయమైన హక్కులను కాపాడాలన్న స్పృహ కొరవడడం విస్మయాన్ని కలిగిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, దశాబ్దాల తరబడి రూ.12 వేల నుంచి రూ.18 వేల లోపు అరకొర వేతనాలతో కుటుంబాలను గడుపడం ఎంత కష్టమో పాలకులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఉద్యమాలు ఎగిసి పడుతూనే ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రభుత్వం అట్టహాసంగా పేరెంట్ మీటింగ్ నిర్వహించడం వరకు బాగానే ఉంది. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీ దృష్టి సారిస్తే ప్రజోపయోగం ఉంటుంది. పాఠశాల, కళాశాల విద్య, తల్లిదండ్రులు, గురువుల సహకారం పేరుతో మొక్కుబడి తంతును నిర్వహించడం ద్వారా సామాన్యులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని గ్రహించాలి. పాఠశాలలు తెరుచుకునే సమయంలోనే తల్లికి వందనం డబ్బులు జమచేయడం ద్వారా ప్రభుత్వ స్కూళ్ల నుంచి పిల్లలను ప్రయివేటు స్కూళ్లకు తరలించడానికి ఉపయోగపడుతోందనే వాదన వినిపిస్తోంది. అకడమిక్ అడ్మిషన్లకు ముందుగానీ, అడ్మిషన్లు గడువు ముగిసిన అనంతరం తల్లికి వందనం డబ్బులు జమ చేసి ఉంటే బాగుం టుందేమో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనర్హులుగా మిగిలిపోయిన వారి పరిస్థితి ఏమిటో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం ఊరి స్తూనే ఉంది. సున్నపురాళ్లపల్లి -పెద్దదండ్లూరు సమీపంలో శంకుస్థాపన చేసిన తర్వాత భూముల పరిశీలన చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. అన్ని చూసిన తర్వాతే కదా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టింది. ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో, ఎంత సమయంలో పూర్తి చేస్తారో, ఎంత ఉత్పాదకత పరిమాణం, ఉపాధి అవకాశాల గురించి చెప్పాల్సిన అవసరం ఉంది. జెఎస్‌డబ్ల్యు సంస్థ అధి కారులతో కలిసి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పరిశీలన చేయడం ఏమిటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని టిడిపి, జనసేన నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు టిడిపి, జనసేన ఎంపీల మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో సీమ ప్రజలు ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి పార్టీలపై ఆధారపడి ఉంది. లేనిపక్షంలో భవిష్యత్ తరాలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



పత్తూరు వద్ద రక్షణగోడలేని కల్వర్టు

రక్షణ గోడల్లేక.. పొంచి ఉన్న ప్రమాదాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పత్తూరు సమీపంలో కడపకు వెళ్లే ప్రధాన రహదారిపై కేసి కెనాల్ ఉప కాలువకు సంబంధించి నిర్మించిన కల్వర్టుపై రక్షణ గోడలు కరువయ్యాయి. వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రధాన మార్గం కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుపై రక్షణ గోడలు నిర్మించి, ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



దాత రవిశంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న గుడి నిర్వాహకులు

గుడి నిర్మాణానికి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి విరాళం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నంద్యాల రోడ్‌లోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో సుబ్రమణ్య స్వామి గర్భగుడి నిర్మాణానికి శనివారం పూజ చేసి పనులు ప్రారంభించారు. మైదుకూరుకు చెందిన వైసిపి నాయకులు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి సుబ్రహ్మణ్యస్వామి గుడి నిర్మాణానికి రూ.15 లక్షలు విరాళం అందజేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవిశంకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఖాజీపేట సిఐకి ఎస్‌పి ప్రశంసలు

ప్రజాశక్తి - ఖాజీపేట



ఎస్‌పి ప్రశంసాపత్రం అందుకుంటున్న సిఐ మోహన్

ఖాజీపేట సిఐ ఆర్.మోహన్‌ను ఎస్‌పి ఇజీ అశోక్‌కుమార్ అభినందించడం తోపాటు ప్రశంసా పత్రం, రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం సిఐ మాట్లాడుతూ చోరీ ఘటనలకు సంబంధించి సొత్తును రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ చూపినందుకుగాను తనకు ఈ గౌరవం దక్కిందని తెలిపారు. స్థానిక కానిస్టేబుల్ సుధాకర్ కూడా ఎస్‌పి నుంచి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.



సన్మానం అందుకుంటున్న షేక్ ఇంతియాజుద్దీన్

షేక్ ఇంతియాజ్‌కు జాతీయ గౌరవ పురస్కారం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేటకు చెందిన షేక్ ఇంతియాజుద్దీన్‌కు తెలుగువెలుగు మహానంది జాతీయ పురస్కారం దక్కింది. శనివారం హైదరాబాదులోని చిక్కడపల్లిలో త్యాగరాయ గానసభలో ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. సామాజిక సేవారంగంలో విశిష్ట కృషి చేసినందుకుగాను తనకు ఈ గౌరవం దక్కిందని ఇంతియాజుద్దీన్ తెలిపారు.

తల్లిని చూసేందుకు వచ్చి కొడుకు మృతి

ప్రజాశక్తి - లింగాల



మృతిచెందిన శ్రీనివాసులు

సొంత ఊరిలోనే కన్నతల్లిని చూసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో బస్సు కోసం ఎదురు చూస్తూండగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం లింగాల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని లోపట్నూతల గ్రామానికి చెందిన కొరకటి శ్రీనివాసులు (45) భార్య పిల్లలు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జీవనం సాగిస్తున్నారు. సొంత ఊరు లోపట్నూతల గ్రామంలోనే తల్లి ఉండడంతో అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు వచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం తల్లిని చూసేందుకు తెల్లవారుజామున బయలుదేరాడు. తల్లిని చూసి యోగక్షేమాలు అడిగి, తిరుగు ప్రయాణం కోసం బస్సు ఎదురుచూస్తున్న సమయంలో షుగర్ లెవల్ పడిపోవడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి, అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

వేంపల్లెలో అగ్ని ప్రమాదం

మోటార్ బైకులు, ఇతర సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాయచోటి బైపాస్‌లో ఉన్న ఓ ఇంటిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మోటార్ బైకు, వాకిళ్లు, మోటార్‌తోపాటు ఇతర సామగ్రి దగ్ధమయ్యాయని బాధితుడు ఎద్దుల కొండా యుడు వాపోయాడు. ఇంటిలో నుండి పొగ వ్యాపిస్తుండడంతో ఆ ప్రాంత ప్రజలు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఫైర్ సిబ్బంది వచ్చేసరికి ఇంటి ఆవరణలో ఉన్న మోటార్ బైకు,



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన మోటార్

మరమ్మతుకు తెచ్చిన వాకిళ్లు, కిటికీలు, తాగునీటికి చెందిన మోటార్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని. ఫైర్ సిబ్బంది సమయానికి రావడంతో ఇంటి లోపల ఉన్న వస్తు సామగ్రి కాలిపోలేదన్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది కేసు నమోదు చేశారు.

పూర్తి స్థాయిలో అందని పచ్చిరొట్ట విత్తనాలు

అదును దాటుతున్నా పట్టని అధికారులు - బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

కుందూ, కెసి కాలువ ఆయకట్టు కింద వరి పంటను సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. జులై ప్రారంభం నుంచి పచ్చిరొట్ట సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొం టున్నారు. ఈ మేరకు విత్తనాలు అందించడంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాల వరకు సాగు చేపడతారు. 1200 క్వింటాళ్ల వరకు జీలగలు, జనుములు రైతులకు అవసరం కాగా రైతులకు అవసరం మేరకు పూర్తి స్థాయిలో సరఫరా కాలేదు. వరి పంట సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు జీలగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిని సాగు చేస్తారు. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌కు సమృద్ధిగా నీరు వచ్చి చేరుతోంది. సకాలంలో కెసి కాలువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని.. రైతులు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సబ్సిడీ విత్తనాలు ఇంకా అవసరం ఉందని, సరఫరా కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కిలో రూ.61.50 పంపిణీ చేస్తుంది. కొంతమంది రైతులు అదును దాటుతుందని బహిరంగ మార్కెట్లో కిలో జీలగలు రూ.130తో కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. కొంతమంది రైతులు ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేస్తుందని వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి సబ్సిడీతో పచ్చిరొట్ట విత్త నాలు పంపిణీ చేసేది లేదని ప్రకటిస్తే రైతులు కొనుగోలు చేసి తెచ్చుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా పచ్చిరొట్ట ఎరువులను ఒక నెల ముందుగా సాగు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఆలస్యమైతే పచ్చిరొట్ట ఎరువులతో భూమికి ఎలాంటి ఉపయోగం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.



పచ్చిరొట్ట ఎరువులు సాగుకు సిద్ధంగా ఉన్న పొలాలు

శిలాఫలకంలో పేరుపై రాజకీయం తగదు



గండిలో పనులు పరిశీలిస్తున్న వేంపల్లి టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో శిలాఫలకంలో పేరు ఉండాలనే దానిపై రాజకీయం తగదని వేంపల్లి మండల టిడిపి పరిశీలికుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గండి క్షేత్రంలో శనివారం ఆయన ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గండిలో జరుగుతున్న పనులను దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్యతో కలిసి రఘునాథ్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధానార్చకులు రాజా స్వామి పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్‌ఆర్ ప్రభుత్వం వచ్చిన ఒక్క రోజులోనే మా టిడిపి చైర్మన్ వెంకటస్వామి రాజీనామా చేశారు. ప్రభుత్వం మారి ఏడాది పూర్తి అయినప్పటికీ చైర్మన్ పదవికి రాజీనామా చేయకపోవడం శోచనీయమన్నారు. కొందరు రాజకీయ నాయకులు గండి క్షేత్రానికి వచ్చి నోటికి వచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. పదవి కాంక్షతో శిలాఫలంపై పేర్లు రావాలనే ఉద్దేశంతో పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ ప్రారంభించడం ఏమాత్రం తగదన్నారు. శిలాఫలకాలపై పేర్లు ఉండాలంటే 2020 నుంచి 2024 వరకు గండి క్షేత్రంలో పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారో చెప్పాలన్నారు. గండి క్షేత్రంలో ఏడాదికి ఒక్కసారి శ్రావణమాస ఉత్సవాలలో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్క జిల్లాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారని తెలిపారు. ఆ ఉద్దేశంతో గండి క్షేత్రంలో పనులు పూర్తి కావాలని పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో దాదాపు రూ.కోటి పైన బిల్లులు చేయించిన విషయాన్ని వారు గుర్తు చేసుకోవాలన్నారు. వారికి బిల్లులు చెల్లించడమేకాక మళ్లీ జరగాల్సిన పనులు వేగవంతం చేయలని ప్రత్యేక నిధులు తెప్పించారన్నారు. ఇప్పటికైనా చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి వేంపల్లె మండల కన్వీనర్ రామమునిరెడ్డి, గండి దేవస్థాన మాజీ చైర్మన్లు వెంకటస్వామి, భాస్కర్, వీరభద్ర, వేమకుమార్, శివకృష్ణారెడ్డి, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు, రెడ్డయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న సూపరింటెండెంట్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రక్తదాన శిబిరం అభినందనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్వచ్ఛంద రక్తదాన శిబిరం అభినందనీయమని ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ రంగనాథ్, బ్లడ్ బ్యాంక్ డాక్టర్ గోపాల్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులు రాజ్యాధికారానికి కృషి చేయాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జేష్టాది భాస్కర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దళితులు రాజ్యాధికారం కోసం కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జేష్టాది భాస్కర్ కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లాలో శనివారం మాల మహానాడు నూతన కమిటీని ఎన్నుకున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులుగా గోపాల్‌దాస్ రాజశేఖర్, జమ్మలమడుగు మండల అధ్యక్షులుగా తోకల రాజేష్, మైలవరం మండల అధ్యక్షులుగా పట్నం వినోద్‌కుమార్, పెద్దముడియం మండల అధ్యక్షుడుగా పౌలుగాల ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నికున్నామని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి పేదవారికి కూడు, గూడు, బట్ట ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వస్తున్నా, వెంటనే మమ్మల్ని మర్చిపోయి దళితుల మీదనే దాడులు చేస్తున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో దళితుల మీద దాడులు అరిక ట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులను సత్వరమే న్యాయం చేయాలన్నారు. మాల లు ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి అయ్యేందుకు కమిటీ పోరా డుతుం దని పేర్కొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మ కం ఉంచి పదవి ఇచ్చిన భాస్కర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో కడప జిల్లా యూత్ లీడర్ పి.రాజేష్, పోరుమామిళ్ల మండల అధ్యక్షు లు జక్కుల కిరణ్, బీఎస్పీ ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి కిరణ్, కల్యాణ్ పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న జింకా సుబ్రమణ్యం

'జింకా'కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్ర ప్రభుత్వానికి చెందిన నీతి అయోగ్ మన సంస్థగా గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ తొమ్మిదవ వార్షికోత్సవ సందర్భంగా హైదరాబాదులోని త్యాగరాజు గానసభలో ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ సాహిత్యవేత్త జింకా సుబ్రహ్మణ్యంకు డాక్టరేట్ పద్మ ప్రతిభ జాతీయ పురస్కారాన్ని శుక్రవారం సాయంత్రం అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీరామమూర్తి, గ్రంథాలయ అధికారి మారెళ్ల శ్రీనివాసరావు, రైల్వే డివిజనల్ డిఎస్‌పి సుబ్బారావు, పత్రికా సంపాదకుడు జాబిల్లి చాంద్ బాషా, వంశీ, రామరాజు, దైవజ్ఞశర్మ, కవి రఘువీర ప్రతాప్, మనం ఫౌం డేషన్ చైర్మన్ చక్రవర్తి, కవులు, సంగీత గాయకులు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

నైతిక విలువలుంటే మోడీ పదవి నుంచి తప్పుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి నైతిక విలువలు ఉన్న పార్టీ అయితే ఈ ఏడాది సెప్టెంబర్ 17లోగా ప్రధాని పదవి నుంచి, క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 ఏళ్లు పైబడిన వారికి ఎవ్వరికీ టికెట్లు ఇవ్వడం లేదని 2019లో అమిత్ షా చెప్పారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులు ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్డ్ మెంట్ తీసు కోవాలని ఆర్‌ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భగవత్ జూలై 9న నాగ పూర్‌లో చెప్పా రన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి అగ్రనాయకులు అద్వానీ, మురళీ మనో హర్ జోషి, వెంకయ్య నాయుడు, జస్వంత్ సింగ్ వంటి వారు క్రియా శీల రాజకీయాల నుంచి తప్పు కున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది సెప్టెంబర్ 17కు ప్రధాని నరేంద్ర మోడీకి 75 ఏళ్లు నిం డుతాయని పేర్కొన్నారు.



ప్రమాదంలో గాయపడిన బావ బామ్మర్ది

టిప్పర్, బైక్ ఢీ : ఒకరు దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు బైపాస్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజుపాలెం మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన నల్లమగారి బాలనాగయ్య, అతని బావమరిది మద్దూరి హుస్సైనయ్య బైక్‌పై మైదుకూరు వైపు వెళుతుండగా, టిప్పర్ రాంగ్ డైరెక్షన్లో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్ ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ బాలనాగయ్య(43) చికిత్స పొందుతూ మృతి చెందాడని దువ్వూరు పోలీసులు తెలిపారు. బాల నాగయ్య కుమార్తె నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

'సుపరిపాలనకు తొలిఅడుగు'లో నాయకులు

ప్రజాశక్తి - వేముల

స్థానిక నల్లచెరువుపల్లె గ్రామంలో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పేర్ల శేషారెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వాటిని కూడా కూటమిప్రభుత్వం అమలు చేస్తుందని నాయకులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు , కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - లింగాల



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ధనుంజయ నాయుడు

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని జొన్నలగడ్డ ధనుంజయనాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని పార్నపల్లెలో శనివారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే దక్కుతుందన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పనులు పరుగులు

గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మేదర రవి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల పనులు కూటమి ప్రభుత్వం పాలనలో పరుగులు తీస్తున్నట్లు గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మేదర రవికుమార్ తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టు పనులు అన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైనట్లు చెప్పారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నట్లు చెప్పారు. ప్రధాన కాలువపై జీడిపల్లి జలాశయం నుండి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వరకు లైనింగ్ పనులు నిర్వహణ జరుగుతోందన్నారు. ఎపిని గ్లోబల్ ఎలక్ట్రిక్ విమాన తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఏవియేషన్ సంస్థలే కాకుండా ఈప్లెన్ కంపెనీ, బ్లుజ్ ఏవియేషన్, మాగ్నమ్ వింగ్స్ వంటి ప్రముఖ ఈవిటిఒఎల్ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపాయన్నారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో విద్యార్థినులపై కొందరు సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు సీరియస్‌గా విచారణ చేసి వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించడంతో ల్యాబ్ అటెండర్, ల్యాబ్ టెక్నీషియన్లు సహా మొత్తం నలుగురును సస్పెండ్ చేశారని చెప్పారు.



ఎమ్మెల్యేను కలిసిన టిడిపి నాయకులు

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందని, రైతులకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి సహకార సంఘాలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. శనివారం హైదరాబాదులో ఖాజీపేటకు చెందిన టిడిపి నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. టిడిపి మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూఖ్ అహ్మద్, నూతనంగా ఎంపికైన అగ్రహార సహకార సంఘం అధ్యక్షులు హరినాథరెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, సహకార సంఘం సభ్యులు నాగేశ్వరుడు, ఓబులరెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

విభజన హామీల అమలు కోసం 18న చలో ఢిల్లీ

డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 18న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు అరుణ్, కృష్ణారెడ్డి, అజమ్ పాల్గొన్నారు.